# ఆనంద భైరవి

★ బి. అనూరాధ ★

ఎందుకు నన్ను అలా పీక్కుతింటారు? నా హృదయాన్ని సరిగా వుండనివ్వరా? నే నెలా వుంటే మీకేం? పిచ్చిపిచ్చిగా వుంటా; వెర్రివెర్రిగా వుంటా. ఆలోచిస్తా, ఆలోకన చేస్తా, ఆనందపడతా, ఇంకా కావలిస్తే ఆక్రందన చేస్తా హృదయం శిథిలం అయేటట్టు.

ఏమిటా రోదన ధ్వని? అయ్యో, ఆ రోదనధ్వని వినేటప్పటికి నా నయనాలు అశ్రుపూరిత మౌతున్నాయి. మనస్సు దడదడా మంటూ ముందుకు అతి వేగంగా పరిగెడుతూంది. అబ్బ! రోదన ధ్వని కాదు. ఎవరో తెలిసీ తెలియని కంఠాలనుంచి వచ్చే కఠినమైన రోత ధ్వని. ఇక్కడ వుండలేను, పోతా! ......ఎవరక్కడ? నవ్వులూ, మందహాసాలూ చేస్తున్నారు? ఎంత స్వచ్ఛమైన, తెల్లటి, మెత్తని, పాలమీగడలాంటి నవ్వులు వినబడుతున్నాయి. ఇప్పుడు నా మనస్సు చల్లగా, హాయిగా వుంది చిరునవ్వు నవ్వుతూ. ఎన్నిరోజులనుంచో ఈ నవ్వుల ధ్వనికోసం ఎదురుచూస్తున్నా. ఈ నాటికి నా అభిలాష నెరవేరింది. ఏడ్పులకు నే నెగటుగా కనిపిస్తా, నవ్వులకి తియ్యగా కనబడతా. అందరికీ ఎందుకు కనబడనూ? అందరికీ నేను సమంగా కనబడితే నాకెంతో ఇష్టం. నన్నెవరూ పలుకరించరు. ఆ చిరునవ్వులు ఎలా గిలిగింతలు పెడుతున్నాయో! ఈ నవ్వులనే తెల్లటి వెలుగులో నేనెలా ప్రకాశిస్తున్నానో! ఆహా ఇక్కడ తివాసీ పరచినట్లుగా పచ్చనిగడ్డి ఎంత మనోహరంగా వుందో. కాస్సేపు నిద్రపోతా యీ గడ్డిమీద. ఎంత మధురమైన చక్కటి నిద్రపట్టిందో. ఎన్నో కలలు. నన్ను ఎక్కడికో పట్టి తీసుకుపోతున్నారు. ఆ...మంటలలో విసిరేశారు. ఊహుఁ...కాలలా. ఇంకా ఎక్కడికి బొంగరంలా పరుగెడుతున్నా? నా కాలిబొటనవ్రేలు ఏమిటో వ్రాస్తూంది బొంగరం ముల్లులా, పెన్సిల్ ముల్లులా! ఏమిటో దాని అర్థం? ఇదేమిటి, ఇక్కడ ఇంత పట్నం వుంది? ఆహా, ఏమి అందం! ఆ మేడ ఎంత బావుందో! ఎక్కుతా. అయ్యో, మెట్లు లేవే. ఊఁఫ్, ఎగురుతా! ఈ ఉయ్యాలలో పడుకుని బడలిక తీర్చుకుంటా.

ఎవరూ, ఉయ్యాల అలా ఊపుతారు? వద్దు. వద్దు. కడుపులో తిప్పుతూంది. కళ్లు తిరుగుతున్నాయి. జారిపోతున్నా. అబ్బ క్రిందపడ్డా. భయం, గుండెలు గడియారంలా టిక్ టిక్ కొట్టుకుంటున్నాయి.

అయ్యో! ఉయ్యాలమీదనుంచి కాదు కింద పడత. పచ్చని తివాసీలాంటి గడ్డిమీదనుంచి కింద పట్టి నేలమీద పడ్డా. లేచిపోతా. దాహం. ఎక్కడ తీరుతుంది ఈ దాహం, అమ్మ. ఇంచక్కని వర్షం వస్తూంది. దోసిలిపట్టి నీరు తాగుతా. ఎందుకు నన్ను అలా తడుపుతుంది వర్షం? నా తలమీద ఎన్ని వర్షపు ధారలు ముత్యాలు వలక పోస్తున్నాయో? నా చుట్టూ కోలాటం ఆడుతున్నాయి. నేను మధ్యని కృష్ణుడులా నుంచున్నా. ఆశ్చర్యం! వర్షపుధారలు గోపికా స్త్రీలు అయాయి. నేనో! నిజంగా కృష్ణుడు అయిపోయాను. వాళ్ళంతా నవ్వులతో నన్ను పలకరిస్తున్నారు. నేను మందహాసంతో జవాబిస్తున్నాను. నా మురళి నలుమూలలా ధ్వనిస్తూంది నవ్వుల పాటలతో. నా చేతిలోకి మురళి బదులు సర్పం వచ్చిందేం? గోపికలంతా సర్పాలు అయారు. నేను పాముల నాడినయా. నా మురళి నాగస్వరం పాడుతోంది. ఆకాశం, భూమి మధ్యనవున్న క్రిమికీటకాలన్నీ స్వచ్ఛమైన మనస్సులతో అన్నింటినీ మరచి నిద్రపోతున్నాయి. నేనూ నా స్వచ్ఛమైన చిరునవ్వు మనస్సుతో మైమరచి నిద్రపోతా. ఎప్పుడు వస్తుందో మెలకువ. నన్ను ఎవరూ లేపకుండా వుంటే బాగుండును. ఎందుకో మరి అంతా లేపుతారు. నే లేవకపోతే యేం వాళ్ళకి? ఊహుఁ ...లేవను యీసారి. నాకు నిద్రలో ఎంతో సుఖం. మంచిమంచి కలలూ తియ్యటి భావాలూ వస్తాయి. పెద్దపెద్ద సీనరీలూ, కొత్తకొత్త ప్రపంచాలూ అన్నీ కనబడతాయి. ఎంచక్కా—

నాకు ఎప్పుడూ నిద్ర కావాలి. నిద్ర నాకు తల్లి. నన్ను ఎప్పుడూ తన ఒడిలో చిచ్చికొడుతూ, జోలపాటలు పాడుతూ నిద్రపుచ్చుతుంది. నా తల్లి నిద్రా దేవత. ఆమెనే ఎప్పుడూ తలుస్తా. ఆరాధిస్తా.